

# విభారె

## తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 15-09-2022 సంపుటి : 04 సంచిక : 25 పేజీలు : 4 వెల : రూ 3-00

# శాసన మండలి, శాసన సభా సమావేశాలను విజయవంతం చేయాలి




### సభ్యుల ప్రశ్నలన్నింటికీ సమాధానాలను సకాలంలో అందజేయాలి

### పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలి

అమరావతి, సెప్టెంబరు 14 ఈ నెల 15 వ తేదీ నుండి జరుగనున్న ఆంధ్రప్రదేశ్ శాసన మండలి మరియు శాసన సభా సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు మరియు ఆంధ్రప్రదేశ్ శాసన సభా స్పీకర్ తమ్మినేని సీతారామ్ అన్ని శాఖల కార్యదర్శులను, పోలీస్ అధికారులను కోరారు. గత సమావేశాల్లో మరియు ప్రస్తుతం సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానాలను సకాలంలో అందజేయాలని అన్ని శాఖల కార్యదర్శులను వారు కోరారు. సమావేశాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పటిష్టమైన బందో బస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు వారు సూచించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ శాసన సభ కమిటీ హాల్ లో పలు శాఖల కార్యదర్శులు మరియు పోలీస్ అధికారులతో వేరు వేరుగా జరిగిన సమావేశాల్లో వారిరువురూ పాల్గొని సభ్యుల ప్రశ్నలకు సకాలంలో సరైన సమాధానాలను అందజేయడం మరియు పోలీస్ బందో బస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు మాట్లాడుతూ గౌరవ శాసన మండలి సభ్యులు అడిగే ప్రశ్నలకు సకాలంలో సరైన సమాధానాలను అందజేస్తూ వారి గౌరవాన్ని కాపాడాల్సి భాద్యత అధికారులపై ఉందన్నారు. అటు వంటి సత్సాంప్రదాయం కొనసాగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. గత సమావేశాల్లో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలలో కొన్నింటికి ఇంకా సమాధానాలు అందజేయాల్సి ఉందని, ఆ సమాదానాలను కూడా ఈ సమావేశాల్లో అందజేయాలని అధికారులను ఆయన కోరారు. మాజీ ఎం.ఎల్.సి.ల మెడికల్ బిల్లుల చెల్లింపుపై ఆర్థిక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పలు ఆరోగ్య సమస్యలతో బాధపడే మాజీ ఎం.ఎల్.సి.లకు అందజేసే ఔషధాలను వారు నివశించే ప్రాంతాల్లోనే అందజేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఆయన సూచించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు అందజేసేందుకు ప్రతి శాఖ ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ఆయన సూచించారు. అనంతరం పోలీస్ అధికారులతో శాంతి, భద్రతల అంశాన్ని సమీక్షిస్తూ ప్రశాంత వాతావరణంలో సమావేశాలు కొనసాగేలా పటిష్టమైన బందో బస్తు ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర డి.జి.పి. కె.రాజేంద్రనాద్ రెడ్డిని ఆయన కోరారు. గౌరవ సభ్యులు బస చేసే ప్రాంతాలు మొదలు సమావేశాలకు వారు హాజరు అయ్యేంత వరకూ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, వారి రాకపోకలకు ఎటు వంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసన సభా స్పీకర్ తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ ప్రజల యావత్ దృష్టి ఈ నెల 15 నుండి జరుగబోవు శాసన సభ సమావేశాలపై ఉంటుందని, వాటికి ఎంతో ప్రత్యేకత ఉందనే విషయాన్ని అధికారులు అందరూ గుర్తించాలన్నారు. సమాచార, సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఈ సమావేశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. ఈ నేపథ్యంలో సభ్యులు అడిగే ప్రతి ప్రశ్నకు సరైన సమాధానం అందజేయాల్సిన భాద్యత అధికారులపై ఉందన్నారు. సభ్యుల గౌరవాన్ని కాపాడటంలోనే మన గౌరవం ముడిపడిఉందనే అంశాన్ని అధికారులు అందరూ గుర్తించాలన్నారు. గత సమావేశాల్లో గౌరవ శాసన సభ్యులు అడిగిన ప్రశ్నల్లో పలు ప్రశ్నలకు ఇంకా సమాధానాలను అందజేయాల్సి ఉందని, వాటన్నింటినీ గురువారం నుండి జరుగబోవు సమావేశాలు ముగిసే లోపు తప్పక అందజేయాలని అన్నిశాఖల కార్యదర్శలను ఆయన కోరారు. మాజీ శాసన సభ్యులకు ప్రభుత్వ పరంగా అందజేసే వైద్య సేవలను మరింత మెరుగు పర్చాలని, వారికి చెల్లించాల్సిన వైద్య బిల్లులను సకాలంలో చెల్లించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన కోరారు. అనంతరం పోలీస్ అధికారులతో శాంతి, భద్రతల అంశంపై ఆయన చర్చిస్తూ ఈ సమావేశాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, పలు శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. అటు వంటి పరిస్థితుల్లో ఎంతో పటిష్టమైన పోలీస్ బందో బస్తు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర డి.జి.పి. కె.రాజేంద్రనాద్ రెడ్డిని ఆయన కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడ గ్యాప్లు అయితే ఉన్నాయో వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. సచివాలయం చుట్టూ ఖాళీ ప్రాంతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నాలుగు వైపులా పటిష్టమైన పోలీస్ బందో బస్తుతో పాటు అధునాతన సమాచార, సాంకేతిక వ్యవస్థతో పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటు వంటి ఏమరపాటులేకుండా ఎంతో అప్రమత్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది బందో బస్తు విధులను నిర్వహించాలని ఆయన సూచించారు.

## రాజధాని మార్పు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదు

### టీడీపీ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

అమరావతి సెప్టెంబర్14 రాజధాని మార్పు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదంటూ రాజ్యసభలో విజయసాయ ప్రయివేటు బిల్లు పెట్టారని టీడీపీ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కాకుండా వ్యక్తి గత ఏజండా మీద అధికార పార్టీ దృష్టి సారిస్తోందన్నారు. లేని అధికారంతో ఇప్పుడు అసెంబ్లీలో ఎలాంటి బిల్లు పెట్టలేరని అన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతేనని హైకోర్టు స్పష్టం చేయటంతో పాటు ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లి వచ్చిందన్నారు. న్యాయస్థానం తీర్పులను ఉల్లంఘించాలనుకోవటం మూర్ఖత్వమే అవుతుందన్నారు. అసెంబ్లీ సమావేశాలు రాజ్యాంగ పరంగా పెట్టాలి.. కాబట్టి పెడుతున్నారు తప్ప ప్రజాసమస్యల కోసం కాదన్నారు. అమరావతిపై అవగాహన లేని ఒక్కో మంత్రి ఒక్కో పొంతన లేని ప్రకటన చేస్తున్నారని విమర్శించారు. దీనిపై చర్చకు తామెప్పుడూ సిద్ధమేనన్నారు. చర్చకు రాలేకనే మంత్రులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అధిక ధరలు, అమరావతి, పోలవరం, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం వంటి అనేక ప్రజాసమస్యలపై ఉభయసభల్లో చర్చకు పట్టుబడతామన్నారు. ప్రజా సమస్యలు లేవనెత్తితే సస్పెండ్ చేస్తామనే ధోరణి ప్రభుత్వానికి సరికాదని యనమల రామకృష్ణుడు అన్నారు



## రాష్ట్రంలో కొత్తగా 4 వేల డిజిటల్ లైబ్రరీలు

### ప్రతి సచివాలయానికి అనుసంధానంగా లైబ్రరీ


### గ్రంధాలయాల బాధ్యతను ఛైర్మన్లు తీసుకుని పనిచేయాలి

### జిల్లా గ్రంధాలయాల ఛైర్మన్లతో భేటీలో మంత్రి బొత్స సత్యనారాయణ



విజయవాడ, సెప్టెంబరు 14 గ్రంధాలయాల పూర్వ వైభవానికి గ్రంధాలయాల ఛైర్మన్లు పూర్తి అంకిత భావంతో పనిచేయాలని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. ఛైర్మన్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రంధాలయాల బాధ్యత నాది అనుకుని పనిచేస్తే ఫలితాలు వస్తాయని ఉద్భోదించారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయాల ఛైర్మన్లు, కార్యదర్శులతో బుధవారం నాడు ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గౌరవనీయ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు గ్రంధలయాలను అభివృద్ధి చేయడంతోపాటు, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ఉన్నారని ఈ దిశలో ఛైర్మన్లందరూ పనిచేయాలని అన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా లైబ్రరీల రూపురేఖలు మార్చాలన్నారు. త్వరలో దాదాపు 4 వేల డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రతి గ్రామ/వార్డు సచివాలయానికి అనుసంధానంగా ఒక గ్రంధాలయం ఉండాలన్నది ముఖ్యమంత్రి గారి ఆలోచన అని ఆ దిశలో తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని జిల్లా ఛైర్మన్లను కోరారు. గ్రంధాలయాల ఛైర్మన్ పోస్టును రాజకీయ పునరావాసంగా కాకుండా, ఒక మంచి అవకాశంగా మలచుకుని పనిచేస్తే ఛైర్మన్లకు మంచి పేరు వస్తుందన్నారు. గ్రంధాలయాల అప్ గ్రేడేషన్ తో పాటు, మరమ్మత్తులు తదితర అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. లైబ్రరీల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని, ఛైర్మన్లు , కార్యదర్శులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రధానంగా విద్యార్థుల్లో చదివే జిజ్ఞాస పెరిగేలా గ్రంధాలయాల ఛైర్మన్లు చొరవ చూపాలని న్నారు. పిలల్లు పోటీ ప్రపంచంలో నిలదొక్కునేలా చూడటంలో లైబ్రరీలు తొలి సాధనం కావాలని ఆయన సూచించారు.

## రెపోరేట్లను పెంచనున్న ఆర్బీఐ, భారం కానున్న ఈఎంఐలు




త్వరలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) తీసుకోనున్న నిర్ణయం సామాన్యులకు మరింత భారంగా మారనున్నట్లు తెలుస్తోంది. పెరిగిపోతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు రెపో రేట్లను పెంచనున్నట్లు సమాచారం. రిటైల్ కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ)ఆధారంగా ద్రవ్యోల్బణం ఈ ఏడాది జూలై లో 6.71 శాతం నుండి ఆగస్టు నాటికి 7.0 శాతం నమోదు చేసింది. పెరిగిన ద్రవ్యోల్బణానికి కారణం ఆహారం, ఇంధర పెరుగుదలే కారణమని మంత్రిత్వ శాఖ ట్వీట్ చేసింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30న ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) జరగనుంది. ఎంపీసీ సమావేశంలో ఐదు నెలల పాటు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఆర్బీఐ రెపో రేట్లు 35 - 50 బేసిస్ పాయింట్ల వరకు పెంచనున్నట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ఆర్బీఐ..కమర్షియల్ బ్యాంకులకు వడ్డీకి రుణాలు ఇస్తుంది. ఆ రుణాల్ని రెపో రేటు అని పిలుస్తారు. ఆ రెపో రేట్లు పెరగడం వల్ల బ్యాంకులు కస్టమర్లకు ఇచ్చే పర్సనల్, హోం లోన్, వెహికల్ లోన్ల వడ్డీ రేట్లను పెంచుతుంది. దీంతో కస్టమర్లు బ్యాంకులకు చెల్లించే ఈఎంఐ భారం పెరగుతుంది.

## అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు ఐదేళ్ల జైలు శిక్ష



హైదరాబాద్: అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ పేరుతో లోన్ తీసుకుని ఎగ్గొట్టారనే బ్యాంక్ అధికారుల ఫిర్యాదుతో కొత్తపల్లి గీతపై గతంలోనే కేసులు నమోదు అయ్యాయి. తాజాగా రుణాల పేరిట బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో ఈ శిక్ష ఖరారైంది. ఇదే కేసులో గీతతో పాటు ఆమె భర్త పి.రామకోటేశ్వరరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష జరిమానా విధించారు. మాజీ ఎంపీకి సహకరించిన బ్యాంకు అధికారులు బీకే జయప్రకాషన్, కేకే అరవిందాక్షన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. విశ్వేశ్వర ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు సీబీఐ కోర్టు రూ. 2లక్షల జరిమానా విధించింది. శిక్షలు ఖరారు కావడంతో కొత్తపల్లి గీత సహా నిందితులను బుధవారం సీబీఐ అదుపులోకి తీసుకుంది.

## అమరావతిపై పాలకుల వ్యూహాత్మక తప్పిదం

### విజయవాడనే రాజధానిగా చేసివుంటే సమస్యవచ్చేది కాదు

### రైతుల పాదయాత్రపై నోరుపారేసుకోవడం సరికాదు

అమరావతి,సెప్టెంబర్14(): అమరావతి వివాదంలో మంత్రులు చేస్తున్న హెచ్చరికలు చూస్తుంటే వారికి కనీస పరిజ్ఞానం ఉందా అన్న అనుమానం కలుగుతుంది. రెచ్చగొట్టేలా చేస్తున్న ప్రకటనలు వారి రాజకీయ స్వార్థాన్ని సూచిస్తుంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానలు పేరుతో సిఎం జగన్ ఆడుతున్న నాటకాలతో ఎపి ప్రతిష్ట ప్రపంచంలో దిగజారుతోంది. రాజధాని సమస్యపై మరోసారి క్రమంగా పెరుగుతూ వస్తున్న వేడి హైకోర్టు రైతుల పాదయాత్రకు అనుమతితో పరాకాష్టకు చేరింది. ప్రజాస్వామ్యబద్ధంగా అనుమతి లభిస్తుందని ముందే తెలిసినా జీర్ణించుకోలేని ప్రభుత్వం మళ్లీ మూడు రాజధానుల పల్లవి ఎత్తుకుంది. గతంలో కంటే తీవ్రంగా మంత్రులు, మాజీ మంత్రులు విశాఖను పాలనా రాజధానిగా చేసి తీరతామని ప్రకటిస్తున్నారు. చంద్రబాబు అమరావతి రాజధాని సంకల్పం తాను ఎందుకు తీసుకున్నానో నొక్కి చెప్పారు. మహానగరం వుంటేనే అభివృద్ధి, ఉపాధి సాధ్యమని పునరుద్ఘాటించారు. తాను రాజధానితోపాటు వివిధ జిల్లాల్లో కేంద్రం ఇచ్చిన సంస్థలు ఏర్పాటు చేయించినట్టు జాబితా ఇచ్చారు. మొత్తంపైన తన ప్రణాళికలోనూ ఆచరణలోనూ లోపం లేనట్టు ఇతరుల వల్లనే ప్రతిష్టంభన వచ్చినట్టు పూర్తిగా సమర్థించుకున్నారు. 1951లో ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమయంలోనూ విజయవాడ రాజధాని కావాలని ప్రయత్నించినా కావాలని అడ్డుకున్న సందర్భాన్ని మరచిపోరాదు. అమరావతి ఒక కులానికి సంబంధించింది కాదు. గత టిడిపి ప్రభుత్వ జాప్యం, అతిశయోక్తి ప్రచారాలు సింగపూర్ ఆశల వైఫల్యం గురించి కనీస ఆత్మ విమర్శ కనిపించడంలేదు. విజయవాడను రాజధానిగా చేసి, దానిచుట్టూ అభివృద్ధి చేసుకుంటూ పోతే ఇవాళ ఈ సమస్య వచ్చి ఉండేది కాదు.

## అమరావతి అభివృద్ధి చెందాలనేది ఆకాంక్ష : కేంద్ర మంత్రి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి నారాయణ స్వామి ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణకు ప్రభుత్వ సహకారం సరిగా లేదని ఆరోపించారు. ఇవాళ విజయ వాడ పశ్చిమ బైపాస్ పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు. రాజధానులు మూడు, నాలుగు పెట్టుకుంటారో రాష్ట్ర ప్రభుత్వం ఇష్టమని, అయితే అభివృద్ధికి విఘాతం కలిగించకూడదని సూచించారు. అమరావతి అభివృద్ధి చెందాలని కేంద్రం కోరుకుంటుందని వెల్లడించారు. అమరావతి రాజధాని కాబట్టే కేంద్రం ఎయిమ్స్‌ను కేటాయించిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అభివృద్ధి పనులు ఆగకూడదని ఆయన అన్నారు. దివ్యాంగుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో కేంద్రం సిద్ధంగా ఉందని అన్నారు. ఒంగోలులో నిన్న దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు, మాన్యువల్ ట్రై సైకిళ్లు, చక్రాల కుర్చీలు, ఇతర సహాయాలను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ వివిధ రకాల సహాయాలు అవసరమైన వారిని గుర్తించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింత చొరవ చూపాలని అన్నారు.

# సంపాదకీయం

గురువారం 15-09-2022

## విపక్షాల ఐక్యత సాధ్యమయ్యేనా

దేశంలోని ప్రతీ రాజకీయ పక్షం 2024 వైపే పయనిస్తున్నది. అన్ని దారులు ఢిల్లీ గద్దె కోసమే కదులుతున్నాయి. సత్తా చూపడానికే అందరూ ప్రయత్నిస్తున్నారు. పర్సెప్షన్ కోసం లడాయి కనిపిస్తున్నది. 1977 లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ప్రతిపక్షాలను ఒక్కటి చేసిన పాత్రను ఇప్పుడు బిహార్ సీఎం నితీశ్‌కుమార్ చేపడుతున్నట్లు కనిపిస్తున్నది. ఆయన కింగ్ అవుతారా లేక కింగ్ మేకర్ అవుతారా తేలాల్సి ఉంది. తాను 2024లో ప్రధాని అభ్యర్థిని కాబోనని మాత్రం చెప్పేసారు. బీజేపీ మీద వార్ ప్రకటించి 'బీజేపీ ముక్త్ భారత్' స్లోగన్ ఎత్తిన తెలంగాణ సీఎం కేసీఆర్ బిహార్ వెళ్లి నితీశ్‌కుమార్, తేజస్వీయాదవ్, లాలూప్రసాద్ యాదవ్‌ను కలిసి వచ్చారు. జాతీయ రాజకీయాలలోకి వెళు తున్నామంటూ నిజామాబాదు బహిరంగ సభలో ప్రకటించారు. దేశమంతటా ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. జాతీయ పార్టీని ప్రకటిస్తారనే సంకేతాలు కేసీఆర్ మాటలలో కనిపిస్తున్నాయి. 2024లో దేశంలో ప్రభుత్వం మార్పు కోసమే తాను బయలుదేరానని నితీశ్‌కుమార్ చెబుతున్నారు. ఓంప్రకాష్ చౌతాలా, అఖిలేష్ యాదవ్, సీపీఎం, సీపీఐ నేతలు సీతారాం ఏచూరి, డి.రాజా, శరద్‌పవార్, కేజ్రీవాల్ తదితరులను నితీశ్‌కుమార్ కలిశారు. 2024లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండబోదని, పీఎం నరేంద్ర మోడీ ప్రధానిగా ఉండబోరని నితీశ్‌కుమార్ చాలా నమ్మకంగా చెబుతున్నారు. నితీశ్ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని కూడా కలిశారు. ఢిల్లీ తర్వాత పంజాబ్‌లో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ డిసెంబర్‌లో జరుగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలోనూ విజయం సాధించాలని తహతహలాడుతోంది. పది లక్షల ఉద్యోగాలు కల్పిస్తామనీ, నిరుద్యోగులకు మూడు వేల రూపాయల భృతి ఇస్తామని, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఉంటుందని కేజ్రీవాల్ హామీ ఇస్తున్నారు. ఈ పద్ధతిలోనే ఆయన దేశాన్ని ప్రభావితం చేసే పనిలో ఉన్నారు. బెంగాల్‌లో సీఎం మమతాబెనర్జీకీ, వామపక్షాలకు పొసగదు. కేరళలో కాంగ్రెస్‌కు, వామపక్షాలకు కుదరదు. కేరళలో కూడా ఆమ్ ఆద్మీ పార్టీ చాపకింద నీరులా విస్తరిస్తున్నదని అంటున్నారు. మహారాష్ట్రలో బీజేపీ మద్దతుతో షిండే ప్రభుత్వం ఏర్పడిన అనంతరం శరద్‌పవార్ ఎన్‌సీపీ, కాంగ్రెస్, ఉద్ధవ్‌ఠాక్రే బలపడినట్లు కనిపిస్తున్నది. వీరిక్కడ త్వరలో జరుగనున్న బాంబే మున్సిపల్ కౌన్సిల్ (బీఎంసీ) ఎన్నికలకు రెడీ అవుతున్నారు. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, యూపీలో అఖిలేశ్ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీ, మాయావతి బీఎస్పీ, ఇలా ఎక్కడి వారు అక్కడ యూనిటీగా ఏర్పడి 2024లో బీజేపీని ఓడించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో 190 కి పైగా సీట్లు సునాయాసంగా సాధించే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ 2014, 2019లో 44-52 సీట్ల వద్ద ఆగిపోయినా, 2014లో 10 కోట్ల 59 లక్షల ఓట్లు సాధించింది. 2019లో 11 కోట్ల 94 లక్షల ఓట్లు సాధిందించింది. ఓట్ల సాధనలో బీఎస్పీ మూడో స్థానంలో ఉంది. దళితుల ఓట్లు సాధించడంలో ఆ పార్టీ ముందుంటుంది. అందుకే ఆ పార్టీని తక్కువగా అంచనా వేయవద్దు. కాంగ్రెస్‌కు 19.5 శాతం ఓట్లు సాధించే సత్తా ఉంది. 2019లో బీజేపీ 31 నుంచి 32 శాతం ఓట్లు సాధించింది. సమాజ్‌వాదీ పార్టీకి 2.6, ఆప్‌కు 0.4 , సీపీఐకి 0.6, సీపీఎంకు 1.8, జేడీయూకు 1.5, జేడీఎస్‌కు 1.06 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. కాంగ్రెస్‌కు సీట్ల సమీకరణ, విపక్షాల ఓట్లు చీలకుండా చూసుకోవడం అవసరం. కాంగ్రెస్ ప్రభావం 160 సీట్ల మీద ఉంటుంది. నిజానికి 2014లో కాంగ్రెస్ సహా విపక్షాల ఓట్లు 69 శాతం ఉంటే, 2019లో 63 శాతం ఉంది. ఒడిశా సీఎం, బిజూ జనతాదళ్ నేత నవీన్ పట్నాయక్‌ను కూడా కలుపుకోవాలి. ఎన్నికల ముందు కాకున్నా తర్వాత ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు ఇచ్చే విధంగా విపక్షాలతో అవగాహన ఉండాలి. కర్ణాటకలో జేడీఎస్‌లాంటి పార్టీలు కూడా కలిసి వచ్చే అవకాశం ఉంది. జేడీఎస్ నేత కుమారస్వామిని కూడా నితీశ్ కలిసి చర్చించారు. బీజేపీకి పొలిటికల్ ఫండ్ కొరత లేదు. అంబానీ, అదానీ బీజేపీ దిక్కే ఉన్నారు. ఒక రాహుల్‌గాంధీ తప్ప కేజ్రీవాల్ సహా ఎవ్వరు కూడా కార్పొరేట్‌లను ఒక్క మాటా అనడం లేదు. 2024లో బీజేపీని ఢీ కొట్టే పరిస్థితి ఉందంటేనే విపక్షాలకు కార్పొరేట్‌లు మద్దతు ఇస్తాయి. ఫండింగ్ ఉంటుంది. రాహుల్‌గాంధీ 'భారత్ జోడో యాత్ర'కు దేశంలో మంచి రెస్పాన్స్ వస్తున్నది. రైతు నాయకుడు యోగేందర్ యాదవ్ లాంటి వారు, ఇతర ప్రోగ్రెస్సివ్ శక్తులు కలిసి రావడం మంచి పరిణామం. పెరిగిన ధరలు, నిరుద్యోగం, అసమానతలు, ప్రశ్నించేవారి మీద నిర్బంధాలు, విపక్షాల మీద ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు, ఎమ్మెల్యేల కొనుగోలు, విపక్ష ప్రభుత్వాల కూల్చివేత, బీజేపీ నేతల విచ్చలవిడితనం లాంటి వ్యవహారాలను ప్రజల ముందు పెడితే 2024 లో మార్పు తథ్యం అనే టాక్ వచ్చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు జరుగనున్న ఏడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను విపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ సమర్థవంతంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. బిహార్‌లో 51 శాతం పేదరికం ఉంటే, గుజరాత్ లో 18 శాతం పేదరికం ఉంది. సీఎంఈఐ నివేదిక ప్రకారం ఈ ఏడు రాష్ట్రాలలో 12 శాతం నిరుద్యోగం నమోదు అయింది. హర్యానాలో 37.3, రాజస్థాన్‌లో 31.4, జమ్మూ-కాశ్మీర్‌లో 32.3 నిరుద్యోగం నమోదైంది. ఆగస్టులో 20 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన పీఎం నరేంద్ర మోడీ ఇప్పటి దాకా కనీసం 10 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం దేశంలో ఆర్థిక పరిస్థితి బాగాలేదు. రూ.135 లక్షల కోట్ల అప్పు ఉంది. 2024 ను ప్రజలు ఎలా తీసుకుంటారో? ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సైతం బెంగాల్ మాదిరి బీజేపీ సిద్ధం అవుతున్నది. మునుగోడు ఉప ఎన్నికను సెమీ ఫైనల్‌గా తీసుకున్నది. మైండ్ గేమ్ ఆడుతున్నది.

# మరో స్కీమ్ తో జగనన్న

విజయవాడ, సెప్టెంబర్ 14,సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జగన్‌ని మించిన సీఎం లేరనే చెప్పొచ్చు. ఇప్పటివరకు ఏపీని పాలించిన సీఎంలతో పోలిస్తే జగన్..సంక్షేమ పథకాలు అమలు చేయడంలో నెంబర్ 1 పొజిషన్‌లో ఉంటారు. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పథకాలు అమలు చేయడంపైనే జగన్ ఎక్కువ ఫోకస్ పెట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలని మాట తప్పకుండా అమలు చేస్తూ వస్తున్నారు. చెప్పిన సమయానికి చెప్పిన విధంగా పథకాలు అమలు చేస్తూ?అర్హుల ఖాతాలో డబ్బులు వేస్తున్నారు. నేరుగా ప్రజల ఎకౌంట్లలోకి డబ్బులు వెళ్లిపోతున్నాయి. దీని ద్వారా ప్రజలు..పూర్తి మద్ధతు తమకే ఉంటుదనే కాన్ఫిడెన్స్ జగన్‌లో ఉంది. పథకానికి డబ్బులు ఇస్తే ప్రజలు?తమకు ఓట్లు వేసేస్తారని అనుకుంటున్నారు. అయితే పథకాలు అందిన ప్రజల్లో ఎక్కువ శాతం ప్రజలు జగన్ పట్ల పాజిటివ్ గా ఉన్నారు. అందుకే అభివృద్ధి కంటే సంక్షేమంపైనే జగన్ ఎక్కువ ఫోకస్ పెట్టారు. ఇదే క్రమంలో అక్టోబర్‌లో మరో పథకానికి జగన్ శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం అమలు చేయనున్నారు. నిజానికి ఈ పథకం మొదట్లోనే అమలు చేయాలి. మరి ఎందుకో ఈ పథకం అమలు జరగలేదు. మరో ఏడాదిన్నరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పథకం అమలుకు జగన్ శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పేరుతో ..బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు, భవన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం సాయం చేయనుంది. ముఖ్యంగా పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహానికి ఈ పథకం ద్వారా ఆర్థికసాయం చేయనున్నారు. ఈ పథకం కింద.. ఎస్సీ, ఎస్టీలకు 1 లక్ష రూపాయలు, ఎస్సీ, ఎస్టీ కులాంతర వివాహాలకు లక్షా 20వేల రూపాయలు, బీసీలకు 50 వేల రూపాయలు, బీసీ కులాంతర వివాహాలకు 75 వేల రూపాయులు, మైనార్టీలకు లక్ష రూపాయులు, వికలాంగుల వివాహాలకు 1,50,000 రూపాయలు, భవన నిర్మాణ కార్మికులకు 40 వేల రూపాయలు సాయం చేయనున్నారు.

ఈ పథకం పేద ప్రజలకు బాగా ఉపయోగపడుతుంది. కానీ ఎన్నికల ముందు అమలు చేయనుండటంతో?ఇందులో రాజకీయ కోణం ఎక్కువ కనిపిస్తోంది. గత టీడీపీ హయాంలో కూడా ఈ పథకం అమలైంది. అంతకంటే ఎక్కువ ఇస్తామని జగన్ చెప్పారు. కానీ పథకం ఇప్పుడు అమలు చేస్తున్నారు. దీంతో 98 శాతం హామీలు పూర్తి అవుతాయని అంటున్నారు. మరి ఈ సంక్షేమ పథకాలు జగన్‌ని సేవ్ చేస్తాయేమో చూడాలి.

# నాని వర్సెస్ లోకేష్



విజయవాడ, సెప్టెంబర్ 14, తెలుగుదేశం పార్టీకి అతి పెద్ద శత్రువు ఎవరైనా ఉన్నారంటే అది కొడాలి నానినే అని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి. ఏదో వైసీపీని పార్టీ పరంగా శత్రువుగా చూస్తారు గాని?వ్యక్తిగతంగా మాత్రం కొడాలి నానినే టీడీపీ శ్రేణులకు శత్రువు. అయితే గతంలో కొడాలి పట్ల టీడీపీ శ్రేణులు ఇంత కోపంతో లేరు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడం కొడాలి నాని మంత్రి అయ్యాకే ఈ పరిస్తితి వచ్చింది. మంత్రిగా కొడాలి నాని ఏం చేశారో తెలియదు గాని?ఎప్పటికప్పుడు మీడియా సమావేశాలు పెట్టి చంద్రబాబు, లోకేష్‌లపై బూతుల వర్షం కురిపించారు. మంత్రి పదవి పోయినా సరే ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు?వ్యక్తిగతంగా చంద్రబాబుని దారుణంగా తిడుతున్నారు. పరోక్షంగా భువనేశ్వరిపై దారుణమైన కామెంట్లు చేస్తున్నారు. తాజాగా కూడా లోకేష్ ఎవరికి పుట్టారో తెలియదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఫైర్ అయ్యారు. కృష్ణా జిల్లా టీడీపీ నేతలంతా కొడాలిపై విరుచుకుపడ్డారు. అలాగే గుడివాడ టీడీపీ శ్రేణులు కూడా కొడాలిని తెగ బూతులు తిట్టారు. అలాగే గుడివాడలో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఇలా కొడాలిపై తమ్ముళ్ళు కసితో రగిలిపోతున్నారు. ఇదే సమయంలో నెక్స్ట్ కొడాలికి చెక్ పెట్టాలంటే లోకేష్ ఇక్కడ పోటీ చేయాలని కొందరు తమ్ముళ్ళు అంటున్నారు. రావి వెంకటేశ్వరరావు మళ్ళీ పోటీ చేస్తే కొడాలి గెలిచే ఛాన్స్ ఉంది. అదే లోకేష్ ఉంటే బలాబలాలు మారుతాయి అంటున్నారు. ఇప్పటివరకు కొడాలి గుడివాడలో వరుసగా గెలవడానికి కారణం ఎస్సీ, ముస్లిం, కాపు ఓటర్లు. లోకేష్ దిగితే ఆ వర్గాలు కాస్త టీడీపీ వైపు చూడవచ్చు అని, అలాగే ఎప్పుడు సపోర్ట్ ఉండే బీసీ, కమ్మ వర్గాల మద్ధతు ఇంకా పెరగవచ్చు అని అంటున్నారు. ఇక జనసేన మద్ధతు ఉంటే కొడాలికి చెక్ పెట్టొచ్చని అంటున్నారు. అయితే లోకేష్ బరిలో దిగినా, జనసేన మద్ధతు ఉన్నా సరే గుడివాడలో కొడాలిని ఓడించడం అంత ఈజీ కాదు.

# జనసేన బలం పెరుగుతోందా




కాకినాడ, సెప్టెంబర్ 14, ఏపీలో జనసేన బలం పెరుగుతున్న విషయం తెలిసిందే?కాకపోతే అనుకున్నంత స్థాయిలో జనసేన బలం మాత్రం పెరగడం లేదు. గత ఎన్నికల్లో కేవలం 6 శాతం ఓట్లు తెచ్చుకుని..ఒక సీటు గెలుచుకుంది?కానీ తర్వాత కాస్త జనసేన పుంజుకుంది. ఇప్పుడు జనసేనకు దాదాపు 5-6 సీట్లు గెలుచుకునే సత్తా ఉందని, 9 శాతం ఓట్లు వరకు పడతాయని తాజా సర్వేలు చెబుతున్నాయి. అయితే 9 శాతం ఓట్లతో జనసేన పెద్దగా సత్తా చాటలేదు. అలాగే ఆ పార్టీకి పూర్తి స్థాయి నాయకత్వ బలం లేదు. దీని వల్ల జనసేన పార్టీకి పెద్ద ఇబ్బంది అవుతుంది. అందుకే జనసేన బలం పెరగాలంటే వైసీపీ-టీడీపీల్లో బలమైన నాయకులని చేర్చుకోవాలి. కానీ పవన్ చేరికలపై ఇప్పటివరకు పెద్దగా ఫోకస్ పెట్టలేదు. దీంతో జనసేన అనుకున్నంత బలపడలేదు. అయితే ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో పవన్ రూట్ మారుస్తున్నారు. వైసీపీ-టీడీపీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలని జనసేనలోకి లాగే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా వైసీపీని గట్టిగా టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. ఇదే క్రమంలో తాజాగా రాజోలుకు చెందిన వైసీపీ నేత బొంతు రాజేశ్వరరావు జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. గత రెండు ఎన్నికల్లో బొంతు?వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. గత ఎన్నికల్లో రాజోలులో జనసేన నుంచి రాపాక వరప్రసాద్ గెలిచిన విషయం తెలిసిందే. ఆ వెంటనే రాపాక వైసీపీలోకి వెళ్ళిపోయారు. దీంతో రాజోలు వైసీపీలో వర్గపోరు మొదలైంది. ఇదే క్రమంలో ఇటీవల రాజోలు ఇంచార్జ్‌గా రాపాకని పెట్టారు. నెక్స్ట్ సీటు కూడా ఆయనకే ఫిక్స్ అయింది. దీంతో ఎంతో కష్టపడిన బొంతుకు ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఆయన జనసేన వైపుకు వస్తున్నారు. సీటు హామీతోనే ఆయన జనసేనలోకి వస్తున్నారని తెలుస్తోంది. రెండుసార్లు ఓడిపోయిన సానుభూతి బొంతుపై ఉంది..అలాగే రాపాకపై తీవ్ర వ్యతిరేకత ఉంది. నెక్స్ట్ ఇక్కడ జనసేనకు గెలుపు అవకాశాలు ఉన్నాయి..టీడీపీతో పొత్తు ఉంటే భారీ మెజారిటీ ఖాయం..లేకపోయిన గెలుపు ఖాయమనే పరిస్తితి. ఆ మధ్య గుడివాడ, తెనాలి నియోజకవర్గాల్లో వైసీపీకి చెందిన కీలక నేతలు కూడా జనసేనలో చేరారు. ఇక నుంచి చేరికలు ముమ్మరం అయ్యే ఛాన్స్ ఉంది.

# చీరాలలో మూడు ముక్కలాట

ఒంగోలు, సెప్టెంబర్ 14,ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వర్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చీరాల. గత ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కరణం బలరాం.. అధికార వైసీపీకి జైకొట్టారు. బలరాం కుమారుడు వెంకటేష్ సీఎం జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకొన్నారు. గత ఎన్నికల్లో ఓడి.. నియోజకవర్గం వైసీపీ ఇంఛార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌తో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం చీరాల వైసీపీ ఇంఛార్జ్‌గా ఉన్నారు కరణం వెంకటేష్. గడప గడపకు మన ప్రభుత్వంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలకు ఆయన హాజరవుతున్నారు. నిన్న మొన్నటి వరకు కరణం శిబిరంతో కలిసి నడిచిన ఎమ్మెల్సీ పోతుల సునీత కొత్త దారి వెతుక్కోవడంతో మూడు ముక్కలాటగా మారిపోయింది. వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక చీరాలలో దూకుడు పెంచారు పోతుల సునీత. ఇంకోవైపు.. ఆమంచి కృష్ణమోహన్‌ను అనుహ్య పరిణామాల మధ్య పర్చూరు వైసీపీ ఇంఛార్జ్‌గా ప్రకటించారు. కానీ.. అది పట్టాలెక్కకపోవడంతో సైలెంట్‌గా తనపని చేసుకుపోతున్నారు ఆమంచి. ఇలా మూడు శిఖరాలు చీరాల కేంద్రంగానే పావులు కదపడం కామనైపోయింది. పార్టీ కేడర్‌కే ఎటు వెళ్లాలో తెలియక తల పట్టుకుంటోందట. దీనికితోడు నేతల మధ్య సమన్వయం లేక కార్యకర్తలు సైతం వర్గాలుగా విడిపోతున్న పరిస్థితి ఉంది. ఆ ప్రభావం చీరాలలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కనిపిస్తోంది. పార్టీ నేతలతో కలిసి పోతుల సునీత గడప గడపకు తిరిగేశారు. ఇందులోనూ గ్రూపుల గోల పెరగడంతో పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో ఇంఛార్జ్ వెంకటేష్ మినహా మిగతావాళ్లు చేపట్టిన కార్యక్రమాలు ఆపక తప్పలేదు. మాజీ ఎమ్మెల్యే పాలేటి రామారావు, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలిసి గడప గడపకు వెళ్తున్నారు ఇంఛార్జ్ కరణం వెంకటేష్. సచివాలయాల సందర్శన పేరుతో ఎమ్మెల్యే బలరాం కూడా ఫీల్డ్ ఎంట్రీ ఇస్తున్నారు. అధిష్ఠానం ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మౌనంగా ఉన్నప్పటికి.. ఆయన అనుచరుల కదలికలు సందేహాస్పదంగా ఉన్నాయని.. పార్టీలోనే ఇంకెవరితో పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే వాదన ఉంది. మొత్తానికి చీరాల వైసీపీలో బలమైన నాయకాగణం ఉన్నప్పటికీ కలిసి సాగే పరిస్థితి లేదు. దీంతో పదే పదే లోకల్ పార్టీలో అనిశ్చిత బయట పడుతోంది. ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్న ఆమంచి గ్రూప్ యాక్టివ్ అయితే వైసీపీ అధిష్ఠానానికి మరిన్ని తలనొప్పులు తప్పదనే చర్చ నడుస్తోంది. అందుకే ఇక్కడి పరిణామాలను ఎప్పటికప్పుడు పార్టీ పెద్దలు ఆరా తీస్తున్నారట. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా చీరాలను వైసీపీ ఖాతాలో వేయాలనే పట్టుదలతో అధిష్ఠానం ఉండటంతో.. రానున్న రోజుల్లో కీలక నిర్ణయమే వెలువడుతుందని అనుకుంటున్నారట. చీరాలలో వైసీపీ పాగా వేయాలంటే ముందుగా ఇక్కడి వర్గ రాజకీయాలకు చెక్ పెట్టాలన్నది కేడర్ మాట. అందుకే వాటికి అధినాయకత్వం ఎలాంటి చికిత్స చేస్తుందనే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ముగ్గురు కీలక నేతలను కలిపేందుకు అధిష్ఠానం అమలు చేసే ఫార్ములాపైనే చర్చ జరుగుతోందట. పార్టీ పెద్దలు చెప్పినట్టు ముగ్గురు కలిసి పనిచేస్తే ఫలితం వార్ వన్‌సైడ్ అన్నది కేడర్ మాట. మరి కరణం, ఆమంచి, పోతుల చేతులు కలుపుతారా.. లేదా అన్నదే ప్రశ్న. మరి.. ఏం జరుగుతుందో చూడాలి.

# షుగర్ పేషంట్లకు టీటీడీ లడ్డూలు

తిరుమల, సెప్టెంబర్ 14, భక్తులను కాపాడే ఆ దేవుడినే కొందరు అక్రమ సంపాదన కోసం వినియోగించుకుంటున్నారు. సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వరుడే కొలువై ఉన్న తిరుమలలోనే భక్తులు మోసపోతున్నారు. భక్తుల విశ్వాసాలను ఆసరాగా చేసుకుని దళారులకు తోడుగా మోసగాళ్లు ఇబ్బడిముబ్బడిగా దోచుకుంటున్నారు. శ్రీవారి దర్శనం పేరుతో భక్తులను మోసగిస్తూ నకిలీ వెబ్ సైట్లు ఎన్నో పుట్టుకొచ్చాయి. దర్శనం టికెట్ పేరుతో భక్తుల్ని నిండా ముంచుతున్నారు అలాంటి నకిలీ వెబ్‌సైట్ నిర్వాహకులు, సిబ్బంది. ఈ క్రమంలోనే మరో ఫేక్ న్యూస్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ సారి ఏకంగా శ్రీవారి లడ్డూ ప్రసాదం పేరుపై ఓ ఫేక్ న్యూస్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతుంది. తిరుపతి తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) ధర్మారెడ్డి భక్తుల సమస్యలను ఫోన్‌లో విన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రా రాష్ట్రం గుంటూరుకు చెందిన దశరథ రామయ్య అనే భక్తుడు మాట్లాడుతూ? తిరుపతి లడ్డూ ప్రసాదంలో చక్కెర కాస్త ఎక్కువగా ఉందని, నాలాంటి మధుమేహ రోగులకు అనుకూలంగా లడ్డూ ప్రసాదం అందజేస్తే బాగుంటుందని అభ్యర్థించారు. అలాగే డయాబెటిక్ పేషెంట్లకు ప్రత్యేకంగా లడ్డూ తయారీ, సరఫరాపై నిర్ణయం తీసుకుంటామని అధికారి ధర్మారెడ్డి సమాధానమిచ్చారు. దీంతో డయాబెటిక్ పేషెంట్ల కోసం తీయని లడ్డూను తయారు చేసి అందిస్తున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వేగంగా వ్యాపించాయిఅయితే ఈ సమాచారం సరికాదని, దీనిపై వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని తిరుపతి దేవస్థానం స్పష్టం చేసింది. సంతృప్తి చెందిన లడ్డూ పేటెంట్ పొందిందని, షుగర్ ఫ్రీ లడ్డూను అందించడం పేటెంట్‌ను ప్రశ్నార్థకంగా మారుస్తుందని కూడా నివేదించబడింది. అలాగే డయాబెటిక్ పేషెంట్ల డిమాండ్ మేరకు షుగర్ ఫ్రీ లడ్డూ అందజేస్తే.. మరికొందరు భక్తులు మరేదైనా కారణంతో మరికొంతమంది ప్రసాదం కావాలని కోరతారని దేవస్థానం వివరించింది.

# ఉత్తరాంధ్రపై వైసీపీ ప్రభావం

విశాఖపట్టణం, సెప్టెంబర్ 14,ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది..అయినా సరే ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులపైనే ఉంది. ఎలాగైనా మూడు రాజధానులని అమలు చేసి తీరుతామని అంటుంది. ఓ వైపు ఏమో అమరావతి కోసం ఆ ప్రాంత ప్రజలు రైతులు ఉద్యమం చేస్తున్నారు?ఇప్పుడు తాజాగా అమరావతి టూ అరసవెల్లి వరకు పాదయాత్ర చేస్తున్నారు. ఉత్తరాంధ్ర మీదుగా పాదయాత్ర జరగనుంది. ఉత్తరాంధ్రలో గాని అమరావతి రైతులకు మద్ధతు వస్తే?వైసీపీకి ఇబ్బంది అవుతుంది. అందుకే పాదయాత్ర ఖచ్చితంగా అడ్డుకుని తీరుతామని ఉత్తరాంధ్ర వైసీపీ మంత్రులు అంటున్నారు. అలాగే ఈ అసెంబ్లీ సమావేశాల్లో మూడు రాజధానుల బిల్లు పెట్టి..ఎలాంటి న్యాయ సమస్యలు లేకుండా మూడు రాజధానులు ఏర్పాటు చేయడానికి వైసీపీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల మూడు ప్రాంతాలకు న్యాయం జరుగుతుందని, ముఖ్యగా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు న్యాయం జరుగుతుందనే కోణంలో వైసీపీ ఉంది. అలాగే ఆ రెండు చోట్ల రాజకీయంగా కలిసొస్తుందని జగన్ భావిస్తున్నారు. ఎలాగో రాయలసీమలో వైసీపీకి బలం ఎక్కువే. కానీ ఉత్తరాంధ్రలో టీడీపీకి బలం ఉంది. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో వైసీపీ సత్తా చాటింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు కలిపి మొత్తం 34 స్థానాలు ఉంటే వైసీపీ 28 స్థానాలు గెలుచుకుంది..కేవలం టీడీపీ 6 స్థానాలు గెలుచుకుంది. అయితే ఇప్పుడు మూడు రాజధానులతో మళ్ళీ ఉత్తరాంధ్రలో మెజారిటీ సీట్లు గెలుచుకోవచ్చు అని, అక్కడ తమ గ్రాఫ్ తగ్గలేదని వైసీపీ భావిస్తుంది. ఈ సారి కూడా 25 సీట్లపైనే గెలుచుకోవాలని వైసీపీ చూస్తుంది. మరి మూడు రాజధానుల ప్రభావం ఉత్తరాంధ్రపై ఉంటుందా? లేక ఇప్పటివరకు ఆలస్యం చేసి, ఎన్నికల ముందు రాజధాని పెట్టడం వల్ల ఉత్తరాంధ్ర ప్రజలు వైసీపీని నమ్ముతారా? అంటే చెప్పలేని పరిస్తితి ఉంది. రాజకీయంగా ఏదైనా జరగొచ్చు. కానీ విశాఖలో రాజధాని ఏర్పాటు చేసినా చేయకపోయినా మాత్రం ఉత్తరాంధ్రలో వైసీపీ గ్రాఫ్ పడిపోయేలా ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఈ సారి వైసీపీకి టీడీపీ గట్టి పోటీ ఇస్తుందని చెబుతున్నారు.

# 3 స్థానాల్లో మూడో ప్లేసేనా

విజయవాడ, సెప్టెంబర్ 14, టీడీపీ మూడో స్థానం?అదేంటి ఏపీలో బలంగా ఉన్న టీడీపీ..మూడో స్థానంలో ఉండటం ఏంటి? వైసీపీకి గట్టి పోటీ ఇస్తూ?నెక్స్ట్ అధికారం దక్కించుకోవాలని అనుకుంటున్న టీడీపీ మూడో స్థానంలో ఉన్న నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. గత ఎన్నికల్లోనే కొన్ని స్థానాల్లో టీడీపీ స్థానానికి పరిమితమైంది. భీమవరం, నరసాపురం, రాజోలు, గాజువాక, అరకు స్థానాల్లో టీడీపీది మూడో స్థానం. రాజోలు సీటుని జనసేన గెలుచుకున్న విషయం తెలిసిందే?అక్కడ వైసీపీకి రెండోస్థానం వచ్చింది. ఇక వైసీపీ గెలుచుకున్న భీమవరం, నరసాపురం, గాజువాక స్థానాల్లో జనసేన రెండు, టీడీపీ మూడో స్థానం. అరకులో వైసీపీ గెలవగా, ఇండిపెండెంట్ సెకండ్, టీడీపీ థర్డ్?అసలు డిపాజిట్ కోల్పోయింది. అయితే ఇప్పుడు రాష్ట్రంలో టీడీపీ బలపడుతుంది. గత ఎన్నికల్లో వైసీపీ గెలిచిన చాలా సీట్లలో టీడీపీ పికప్ అయింది. కానీ ఇప్పటికీ మూడు స్థానాల్లో టీడీపీ మూడో స్థానంలోనే ఉంది. గాజువాక, అరకు స్థానాల్లో సెకండ్ ప్లేస్‌కు వచ్చింది గాని?నరసాపురం, భీమవరం, రాజోలు స్థానాల్లో రాలేదు. ఒకవేళ గాజువాకలో మళ్ళీ పవన్ పోటీ చేస్తే సీన్ వేరేగా ఉంటుంది. పవన్ పోటీ చేయకపోతే మాత్రం ఇక్కడ వైసీపీకి టీడీపీ గట్టి పోటీ ఇస్తుంది. అరకులో గెలిచేంత సీన్ రాలేదు గాని..కాకపోతే సెకండ్ ప్లేస్‌లో ఉంది. అయితే భీమవరంలో వైసీపీ-జనసేనల మధ్య టఫ్ ఫైట్ నడుస్తోంది. నెక్స్ట్ భీమవరంలో పవన్ పోటీ చేస్తే జనసేన గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ టీడీపీకి మూడో స్థానమే. ఎన్నికల్లో నర్సాపురంలో వైసీపీకి దాదాపు జనసేన చెక్ పెట్టేసినంత పనిచేసింది. కానీ తక్కువ మెజారిటీతో ఓడిపోయింది. ఈ సారి వైసీపీకి చెక్ పెట్టేలా ఉంది. జనసేన-వైసీపీ పోరులో టీడీపీ ఇక్కడ మూడో స్థానమే. రాజోలులో కూడా అదే పరిస్తితి. గత ఎన్నికల్లో జనసేన నుంచి గెలిచిన రాపాక వరప్రసాద్?వైసీపీ వెళ్లారు. అయినా సరే ఇక్కడ జనసేన బలం తగ్గలేదు..ఇంకా పెరిగింది. నెక్స్ట్ వైసీపీ-జనసేన మధ్యే పోరు నడవనుంది.



# నేతల్లో పరిశీలకుడి టెన్షన్

విజయవాడ, సెప్టెంబర్ 14,వైసీపీలో రానున్న ఎన్నికలలో విజయంపై రోజు రోజుకూ ఖంగారు పెరిగిపోతోంది. భయం గూడు కట్టుకుంటోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్ లో ఈ భయం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. దీంతో రోజుకో కొత్త నిర్ణయం, పూటకో కొత్త నియామకం చేపడుతున్నారు. తాజాగా ప్రతి నియోజకవర్గానికి ఒక పరిశీలకుడిని నియమించాలని జగన్ నిర్ణయించారు. ఇప్పటికే నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఇన్ చార్జిగా ఉ న్నారు.ఇప్పుడు అదనంగా పరిశీలకుడిని నియమించాలని నిర్ణయించారు. ఆ పరిశీలకుల జాబితా ఇప్పటికే ఖరారైందని కూడా పార్టీ వర్గాలుచెబుతున్నాయి. అంటే ఇప్పుడు ఉన్న నియోజకవర్గ ఇన్ చార్జ్ కాకుండా ఒక పరిశీలకుడు కూడా ఉంటారన్న మాట.జగన్ నిర్ణయంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలలో గాభరా పెరిగింది. అయితే ఈ పరిశీలకులు ఏం చేస్తారు, ఏం చేయాలి, వారి బాధ్యతలు ఏమిటి అన్నది మాత్రం ఇతమిద్ధంగా తెలియదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ ప్రభుత్వ వ్యతిరేకత, నియోజకవర్గ ఎమ్మెల్యేలపై ప్రజలలో అసంతృప్తి తార స్థాయిలో ఉందన్న ఐ ప్యాక్ నివేదిక ఆధారంగా జగన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.జగన్ ఎన్నో ఆశలు పెట్టుకుని జనాలలోకి పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, తాను బటన్లు నొక్కడం ద్వారా లబ్ధిదారులు పొందిన ప్రయోజనాలను ప్రజలకు వివరించి మరో సారి వైసీపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు సోపానంగా మారుతుందని భావించిన గడపగడపకూ కార్యక్రమం దారుణంగా విఫలం అవ్వడమే కాకుండా బూమరాంగ్ అయ్యి ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజలను ఫేస్ చేయలేని పరిస్థితులు ఎదురు కావడంతో ఆయనలో ఖంగారు



మొదలైందని పరిశీలకులు అంటున్నారు. ఆ కారణంగానే పని చేసే వారికే పార్టీ టికెట్లు, విపక్ష విమర్శలకు దీటుగా కౌంటర్ ఇవ్వని మంత్రులకు ఉ ద్వాసన అంటూ తన అసహనాన్ని ప్రదర్శిస్తున్నారని అంటున్నారు.ఇప్పుడు తాజాగా నియోజకవర్గ పరిశీలకులు నియామకానికి సిద్ధం కావడంతో నియోజకర్గాలలో ఇప్పటికే ఉన్న వర్గ విభేదాలతో అయోమయంలో ఉన్న పార్టీ క్యాడర్ మరింత గందరగోళానికి గురి చేసే నిర్ణయంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.ఇప్పుడు నియమితులు కానున్న పరిశీలకులు ఇప్పటికే ఉన్న ఇన్ చార్జీలకు అదనం కావడంతో పరిస్థితి మరింత క్లిష్టం అవుతుందని పార్టీ క్యాడర్ అంటున్నారు. ఇప్పటికే దాదాపు ప్రతి నియోజకర్గంలోనూ గ్రూపు తగాదాలు ఉన్నాయి. పార్టీ టికెట్ ఆశావహుల సంఖ్యా భారీగానే ఉంది. ప్రజా వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలకు టికెట్ ఇచ్చేది లేదంటూ జగన్ ఇప్పటికే ప్రకటించడంతో దాదాపు 151 నియోజకవర్గాలలోనూ ఎమ్మెల్యేలలో అభద్రతా భావం నెలకొని ఉంది. ఆ కారణంగానే దాదాపు అన్ని నియోజకవర్గాలలోనూ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్యా అధికంగానే ఉంది. ఇప్పుడు పరిశీలకుల నియామకం నిర్ణయంతో గ్రూపులు మరిన్ని పెరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలే అంటున్నాయి.దాదాపుగా అన్ని నియోజకవర్గాలలోనూ ఎమ్మెల్యేనే ఇన్ చార్జిగా ఉన్నారు. అయితే ఎమ్మెల్యేలపై ప్రజాగ్రహం ఉందంటూ జగన్ పరిశీలకుల నియామకానికి తెరతీశారు. అఎమ్మెల్యేకు పోటీగా ఒకరిని నియమించాలన్నది ఆయన ఉద్దేశంగా పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అయితే ఉండవల్లి శ్రీదేవి తన నియోజకవర్గానికి ఇన్ చార్జిగా డొక్కా మాణిక్యవరప్రసాద్ ను నియమించడానికి వ్యతిరేకంగా గళమెత్తడం, ఆమె వర్గీయులు ఆందోళనకు దిగడంతో జగన్ వెనక్కు తగ్గారని అంటున్నారు.అందుకే ఇప్పుడు పరిశీలకుల పేర అదనపు ఇన్ చార్జిలను నియమిస్తున్నారని పార్టీ శ్రేణులే అంటున్నాయి. గతంలోలా తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసే ధైర్యం జగన్ కోల్పోయారనీ, పార్టీలో అసంతృప్తి, తన నిర్ణయాలను ధిక్కరించి ఆందోళనలకు సైతం దిగుతున్న పరిస్థితులను గమనించి భయపడుతున్నారనీ అంటున్నారు. ఏది ఏమైనా పేరు పరిశీలకుడే అయినా ఆ పరిశీలకుడి పాత్ర మాత్రం అదనపు ఇన్ చార్జి అనే పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఎమ్మెల్యేలు సహజంగానే పరిశీలకుడికి సహకరించే పరిస్థితి ఉండదని అంటున్నారు. మొత్తంగా ఈ మూడేళ్లలో ఎన్నడూ లేనంత అయోమయ పరిస్థితుల్లో వైసీపీ పార్టీ, ఆ పార్టీ నేతలు, ఆఖరికి ముఖ్యమంత్రి కూడా ఉన్నారని పరిశీలకులు అంటున్నారు. గతంలో జగన్ కు కోపం వస్తుందేమోనని పార్టీ నాయకులు భయపడేవారని ఇప్పుడు నేతలు అసమ్మతి గళం విప్పుతారేమోనని జగన్ భయపడే పరిస్థితి ఏర్పడిందని పరిశీలకులు .


## ప్రభుత్వ ఎరువుల కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం తగదు

కడప ప్రభుత్వ రంగంలోని ఎరువుల సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులు రెడ్డి ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తెలిపారు . బుధవారం కడప నగరంలోని పాత బస్టాండ్ ఆవరణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిర్ణయం అమలులోకి వస్తే రైతులపై తీవ్ర భారం పడుతుందని, కార్మిక వర్గం కూడా రోడ్లపాలు పడతారని వారు తెలిపారు . మానిటైజేషన్ పైప్ లైన్ విధానం వల్ల ఎరువుల కంపెనీలను ప్రైవేటుపరం చేస్తే వ్యవసాయ రంగానికి నష్టం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కంపెనీలు లాభా పేక్షతో ధరలను పెంచి రైతాంగం పై పెనుబారం మోపుతాయని పేర్కొన్నారు. దీనివల్ల వ్యవసాయ రంగం దెబ్బతిని ఆహార ధాన్యాల కోసం విదేశాలపై ఆధారపడి దుస్థితి వస్తుందని అన్నారు. ప్రైవేటీకరణ వల్ల వ్యవసాయం ధ్వంసం అవుతుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు , కార్మిక వర్గాన్ని రక్షించేందుకు ఎరువుల కంపెనీలను ప్రైవేటుపరం చేసే విధానాలకు స్వస్తి పలకాలని పెరిగిన ఎరువుల ధరలను తగ్గించి రైతాంగానికి అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువుల కంపెనీలు ప్రభుత్వ ఆధీనంలో ఉండడం వల్ల వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డాయని ఎరువుల ధరలు కూడా అదుపులో ఉంచగలిగారని బ్లాక్ మార్కెట్ నివారించబడి రైతులకు అందుబాటులో ఉంటున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి లక్ష్మీదేవి నగర నాయకులు విజయ్ , శ్రీనివాసరెడ్డి రైతు సంఘం నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముస్సిపాల్టీ కాదు.. క్యాపిటల్ సిటీయే

విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)అమరావతి ముస్సిపాలిటి ఏర్పాటుపై వ్యతిరేకత కొనసాగుతూనే ఉంది. గ్రామాల్లో జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. ఒక్కరిద్దరు తప్పితే చాలా మంది ముస్సిపాలిటీకి నో అని చెబుతున్నారు. అమరావతి ముస్సిపాలిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తోంది. రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలంలోని 22 గ్రామాలు, దొండపాడు, లింగాయపాలెం, ఉ ద్దండరాయుపాలెంలో అధికారులు తొలి విడతలో గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గ్రామసభకు హాజరైన వారిలో 90 శాతం మంది ముస్సిపాలిటీ ఏర్పాటును వ్యతిరేకించారు. కొందరు మాత్రమే అధికారుల ప్రతిపాదనను స్వాగతించారు. మరోవైపు ఉద్ధండరాయునిపాలెంలో ముస్సిపాలిటీ ఏర్పాటును గ్రామస్థులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం 29 గ్రామాలతో కూడిన క్యాపిటల్ సిటీ ఏర్పాటు చేయాలని కోరారు . ఇక దొండుపాలెం గ్రామంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు అధికారులను ప్రశ్నలతో నిలదీశారు. రాజధాని పరిధిలోని 19 గ్రామ పంచాయతీలతో నగరపాలక సంస్థగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ప్రయత్నించింది.ముస్సిపాలిటీ కాకుండా 29 పంచాయతీలతో కలిపి నగరపాలక సంస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు ఏడు నెలల తరువాత మళ్లీ ఇప్పుడు రాజధాని పరిధి తుళ్లూరు మండలంలోని 19, మంగళగిరి మండలంలోని 3 పంచాయతీలతో కలిపి అమరావతిని పురపాలక సంఘంగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి నుంచి అరసవిల్లి వరకు రైతులు పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో రాజధాని పరిధిలోని 22 పంచాయతీలతో అమరావతిని ముస్సిపాలిటీగా ఏర్పాటు చేసే ప్రతిపాదనను వైసీపీ ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. రాజధాని పరిధిలోని 19 గ్రామ పంచాయతీలతో నగరపాలక సంస్థగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ప్రయత్నించింది.అమరావతి రాజధానిని ధ్వంసం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని రాజధాని గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు వివిధ రూపాల్లో ప్రభుత్వం నిర్ణయాలను ఎదుర్కొంటున్నారు. రాజధాని అమరావతికి మద్దతుగా గతంలో నిర్వహించిన అమరావతి నుంచి తిరుమల పాదయాత్ర విజయవంతం కావడంతో ఈ నెల 12 నుంచి అమరావతి నుంచి అరసవల్లికి పాదయయాత్ర ? 2 నిర్వహిస్తున్నారు.

## అపర భగీరథుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య




**-నేడు నేషనల్ ఇంజనీర్స్ డే**

ఇంకొద్ది క్షణాల్లో ఈ వంతెన కూలిపోతున్నది...రైలును ఆపండి అంటూ కేకలు వేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన సునిశిత మేధావి మో?క్షగుండం విశ్వేశ్వరయ్య. మేం మాటలతో కాలయాపన చేశాం...మీరు నిరంతర క్రియాశూరులై నవభారత నిర్మాణా నికి కృషి చేసిన మహనీయులంటూ 1961 సెప్టెంబర్ 15న బెంగుళూరులో జరిగిన విశ్వేశ్వరయ్య శతాబ్ది వేడుకల్లో అప్పటి ప్రధాని నెహ్రూ చేత ప్రశంసలు పొందిన అపర భగీరథుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్వీకు లు బేస్తవారపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందినవారే. శ్రీనివాసశాస్త్రి, వెంకటలక్ష్మమ్మలకు 1861 సెప్టెంబర్ 15న విశ్వేశ్వరయ్య జన్మించాడు. తల్లిదండ్రులు మోక్షగుండం గ్రామం నుంచి కర్నాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా చిక్‌బల్లాపూ ర్ సమీపంలోని ముద్దనహళ్లికి వెళ్లి స్థిరపడ్డారు. ప్రాథమిక విద్య చిక్‌బల్లాపూర్‌లో సాగింది. తన 15వ ఏటనే తండ్రిని కోల్పో యిన విశ్వేశ్వరయ్య మేనమామ రామ య్య ప్రోత్సాహంతో బెంగుళూరు సెంట్రల్ కాలేజిలో 1880లో ఎం.ఎలో ప్రథమస్థానంలో పాసయ్యాడు. గణితంలో ప్రతిభ కలిగిన విశ్వేశ్వరయ్యను మైసూరు రాజ్య దివాను రంగయ్య గుర్తించి ప్రభుత్వానికి సిఫారసు చేసి స్కాలర్‌షిప్ ఇప్పించారు. ఆ ఉపకార వేతనంతో ఆయన పూణే వెళ్లి ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. దీంతో బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా పబ్లిక్ వర్క్స్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా నియమించింది. మరునటి ఏడాది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆంగ్లపాలకులు విశ్వేశ్వరయ్య కార్యదీక్షను గుర్తించి ప్రపంచ జలాశయాల్లో ఒక్కటైన సుక్కూర్‌బరాజ్ నిర్మాణానికి ఇంజనీర్‌గా నియమించారు. దీంతో సింధూనది నీరు సుద్నోరుకు చేరేలా చేశాడు. ఆ నది నీరు వడగట్టడానికి ఒక వినూత్న విధానం రూపొందించారు. దాహరి దగ్గర నంబనది మీద సైఫన్ పద్ధతిన కట్ట నిర్మించారు. అక్కడ విశ్వేశ్వరయ్య మేధాశక్తితో ఆటో మేటిక్ గేట్లు నిర్మించి సమస్య తొలగించి అందరిని ఆశ్చర్యపరచారు. 1909లో మైసూర్ ప్రభుత్వం ఆయనను చీఫ్ ఇంజనీర్ గా నియమించింది. కృష్ణరాజసాగర్ డ్యాం డిజైన్ ఆయన ఆధ్వర్యంలోనే నిర్మాణం జరిగింది. దేశం లోనే తొలిసారిగా నీటి వృధాని అరికట్టేందుకు నూతన చర్యలను చేపట్టారు. వర్షపు నీటిని ప్రాజెక్టుల ద్వారా నిలుపుదల చేయడం, ప్రవ హించే నీటిని అనకట్టలు, ఉక్కు తలుపుల ద్వారా అరికట్టడానికి రూపకల్పన చేసి తన ఆధ్వర్యంలోనే నిర్మా ణాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ డ్రైనేజీ పద్ధతులకు రూప కల్పన చేసిందీ కూడా ఆయనే. ప్రముఖ ఇంజినీర్లు అయిన కె.ఎల్.రావు, జాఫర్ అలీలు కూడా ఆయన సహాయ సహకారాలు తీసుకున్న వారే. విశ్వేశ్వరయ్యకు 1948 లో మైసూర్ ప్రభుత్వం డాక్టరేట్ ఎల్.ఎల్. డి ఇచ్చి సత్కరించింది. అలాగే బాంబే, కలకత్తా, బెనారస్, అలహాబాద్ తదితర యూనివర్శిటీలు డాక్టరేట్ పురస్కారాలను అందజేశాయి. భారత ప్రభుత్వం 1955లో భారతరత్న అవార్డును ప్రధానం చేసి ఘనంగా సన్మానించింది. ఆయన ఇండి యన్ ఇరిగేషన్ కమిషన్ సభ్యులుగా, కర్నా టకలో చీఫ్ ఇంజనీరుగా అనేక బాధ్య తలను నిర్వహించి సివిల్ ఇంజనీరిం గ్‌లో అప్పట్లోనే నూతన వరవడులను సృష్టించి ప్రపంచ స్థాయిలో రికార్డులు సాధించారు. ఏప్రిల్ 12న 1962 లో విశ్వేశ్వరయ్య దివంతులయ్యారు. అయితే ఆయన పుట్టినరోజు సెప్టెంబర్ 15వ తేదీన నేషనల్ ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నారు. ఆయన పూర్వీకులు పూజించే దేవాలయం మోక్షగుండం ముక్తేశ్వరాలయం నేటికి భక్తులతో ప్రత్యేక పూజ లు అందుకుంటుంది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్వీకుల గ్రామం మోక్షగుండం గ్రామస్థులంటే కర్నాటక రాష్ట్రంలో చాలా గౌరంగా చూస్తారు. విశ్వేశ్వరయ్య 102 సంవత్సరాలు జీవించి ఇంజనీరింగ్ రంగానికే పితామహుడయ్యారు.

## నంద్యాల పట్టణం లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా ఎస్పీ

**నేర నివారనే లక్ష్యంగా అందరూ పనిచేయాలి**

నంద్యాల నంద్యాల పట్టణం లో మంగళవారం అర్ధరాత్రి అన్నీ పోలీసు స్టేషన్ పరిధులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులలో సిసి కెమెరాలు ఏర్పాటు వాటి పనితీరుని పరిశీలించారు. కాలినడకన విస్తృతంగా పర్యటించి నేర నివారణే లక్ష్యంగా పని చెయ్యాలని అదికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించాలని వాటి పనితీరుని ఎప్పటికప్పుడు చూసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.నంద్యాల రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని పద్మావతి నగర్ ,టేక్కె ,ఎస్‌బిఐ కాలనీ లో పర్యటించి సెక్టార్ 1,సెక్టార్ 2 పోలీసు అధికారులతో మాట్లాడి నైట్ బీట్ ల పనితీరుని అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలపాల గురించి ఆరా తీశారు నంద్యాల బస్ స్టాండ్ వద్ద మైనర్లు ఆటొ నడుపుచుండగా వాటిని సీజ్ చెయ్యాలని ఆదేశించారు. నంద్యాల టౌన్ లో శ్రీనివాస సెంటర్ లో రైల్వే స్టేషన్ వద్ద, పద్మావతి నగర్ లో, మార్ట్ బొమ్మలసత్రం వద్ద నైట్ బీట్ లను చెక్ చేసి పోలీసు వారికి కొన్ని సూచనలు ఇచ్చారు. పట్టణం లో నంబర్ ప్లేట్ లేని వాహనాలని సీజ్ చేయాలని మరియు ఒక రోజు వాటిపై ప్రతెక డ్రైవ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.అనంతరం పోలీసు అధికారులకు, గస్తీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో తిరిగే అనుమానస్పద వ్యక్తులను విచారించాలన్నారు. గస్తీని ముమ్మరం చేయాలన్నారు. గస్తీ విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏయే సెక్టార్ లలో, ఎన్ని రూట్ లలో ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారనే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. నైట్ బీట్ లలో ప్రతి నైట్ బీట్ వారు మరియు సెక్టార్ ఆఫీసర్లు అందరూ మ్యాన్ ప్యాక్ కలిగి అప్రమత్తంగా ఉండాలని పిలిచిన వెంటనే రెస్పాన్స్ ఇవ్వాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు.

## పేదలకు అందుబాటులో కార్ బజార్

కడప కడప నగరంలోని పాత బైపాస్ రోడ్ నియమాలు ఆర్ ఎదురుగా భరత్ నగర్ రోడ్ నంబర్ 2 లొ యస్ యన్ యస్ కార్ బజార్, ను సామాన్య ప్రజలు నిమిత్తం అందుబాటులో కి తెచ్చామని నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మధ్యతరగతిపేదప్రజల ఆశలను తీర్చేందుకు ఈ కార్ బజార్ షోరూం ఎంతగానో ఉవయోగపడుతుందని తెలిపారు. అందుబాటు ధరలో అందరికీ కారునుఅందించేందుకు, జిల్లాలోని ప్రజలకు ఈ కార్ బజార్ షొరూమ్ ఎంతో ఉవయోగపడుతుందని మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరలకు మంచి కారు అందించి వారికల నెరవేర్చుటకుఈ కార్ బజార్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. సామాన్యులు అనవసరంగా డబ్బులు పోగొట్టుకుని అమాయకంగా మోసపోకుండా వారికి అందుబాటులోమంచి కండిషన్లో ఉన్న సెకండ్ కార్లను అందించే ప్రయత్నంలో భాగమేఈ కార్ బజార్ షోరూమ్ లక్ష్యమని అన్నారు.

## ప్రతి ఒక్కరిని ఆదుకునే ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం.....

**ఎంపీపీ రాచకొండ లక్ష్మీ రవి**

కమాన్ పూర్ తెలంగాణలోని ప్రతి ఒక్కరిని ఆదుకునే ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం అని కమాన్ పూర్ ఎంపీపీ రాచకొండ లక్ష్మీ రవి అన్నారు. బుధవారం మండలంలోని సిద్దిపల్లి గ్రామంలో సర్పంచ్ తాటికొండ శంకర్ ఆధ్వర్యంలో పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ 57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క అర్హులకు పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. 57 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను అందజేస్తుందని అన్నారు పేదలను ఆదుకునే ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్ కో ఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఉప సర్పంచ్ జాబు సతీష్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కిషన్ రెడ్డి గడప కృష్ణమూర్తి కుందారం సత్యం జంగేపల్లి లక్ష్మణ్ తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆక్రమణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు

**కడప రెవిన్యూ డివిజనల్ అధికారి పి.ధర్మాచంద్రా రెడ్డి హెచ్చరిక**

కడప, ప్రభుత్వ భూములను అక్రమించే ప్రయత్నం చేసినా, అక్రమ లేఅవుట్లను వేసినా.. చట్టపరమైన చర్యలు, క్రిమినల్ కేసులు తప్పవని.. కడప రెవెన్యూ డివిజనల్ అధికారి పి.ధర్మచంద్రారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు.మంగళవారం చింతకొమ్మ దిన్నె మండలం.. గూడూరు గ్రామ పరిధిలోని భావనా టౌన్ షిప్ పరిసర ప్రాంతాల్లో.. అక్రమ లే అవుట్లు, నిర్మాణాల తొలగింపు, భూ ఆక్రమణలను కడప ఆర్డీవో ధర్మాచంద్రా రెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. మండల పరిధిలో అక్రమ కట్టడాలను గుర్తించి వాటికి నోటీసులు జారీ చేసి వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని.. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అక్రమ కట్టడాల నిర్మాణాలు తొలగించే విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా పని చేయాలన్నారు. మండల పరిధిలోని నగర శివార్లలోని రూరల్ ప్రాంతంలో.. అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటన్నిటినీ గుర్తించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ భూముల్లో పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయని, అక్రమ కట్టడాలు నిర్మించే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆక్రమణల తొలగింపుతో పాటు.. ల్యాండ్ కన్వర్షన్ జరగకుండా వేసే లేఅవుట్లను రద్దు చేయాలని, ప్రభుత్వ భూములను ఆక్రమించినా, కాలువలు బూడ్చినా, రోడ్లను ఆక్రమించినా, అనాధికారంగా గ్రావెల్, మట్టిని రవాణా చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటా మన్నారు. ముందుగా నోటీసులు ఇచ్చి.. వారి పైన చట్టపరమైన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సికె దిన్నె తహసీల్దార్ గంగయ్య, విఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రిబ్యునల్ కన్సిలియేషన్ అధికారుల నియామకం

కోరుట్ల సెప్టెంబర్ 14 తల్లిదండ్రులు,వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం కోరుట్ల డివిజన్ కాన్సిలియేషన్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రవి ఉ త్తర్వులు జారీ చేసినట్లు తెలంగాణ ఆల్ సీనియర్ సీటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ,న్యాయవాది హరి అశోక్ కుమార్ తెలిపారు.కోరుట్ల డివిజన్ కాన్సిలియేషన్ అధికారులుగా సీనియర్ సీటీజన్స్ కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు రిటైర్డ్ ఆడిటర్ పబ్బా శివానందం,రిటైర్డ్ డి.ఎల్.పి.ఓ.గంటేడి రాజ్ మోహన్,రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్.ఐ.నల్ల లక్ష్మీ నారాయణ లను నియమించారు. తల్లిదండ్రులు,వృద్ధుల సంరక్షణ కేసుల విచారణలో పరిష్కారం,శిక్షల విషయంలో ట్రిబ్యునల్ అధికారికి కాన్సిలియేషన్ అధికారులు నివేదికలు అందజేస్తారని,తల్లిదండ్రులు,వృద్ధుల పోషణ,సంక్షేమ చట్టం తెలంగాణ ప్రభుత్వం నియమావళి మేరకు ఈ కాన్సిలియేషన్ అధికారులుగా నియమించబడిన వారు తమ విధులను నిర్వహిస్తారని ఆయన తెలిపారు.కాన్సిలియేషన్ అధికారుల నియామకం పట్ల కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కలెక్టర్ రవి, జాయింట్ కలెక్టర్ బి.ఎస్.లత, ఆర్డీవో వినోద్ కుమార్,జిల్లా సంక్షేమ అధికారి బి.నరేశ్ లకు తమ తెలంగాణ ఆల్ సీనియర్ సీటీజన్స్ అసోసియేషన్,జగిత్యాల జిల్లా,కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ల శాఖల తరపున జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్,కార్యదర్శి విశ్వనాథం,కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు పబ్బా శివా నందం,కార్యదర్శి గంటేడీ రాజ్ మోహన్,కోశాధికారి నల్ల లక్ష్మీనారాయణ,మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు రాయల్ కృతజ్ఞతలు తెలిపారు.

## కమనీయం అప్పన్న కల్యాణం

విశాఖపట్నం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవ మూర్తి గోవింద రాజ స్వామిని ఉభయ దేవేరు లతో మండపంలో అధిష్టింప జేశారు పాల్గొన్న భక్తుల, గోత్ర నామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానం లో విశ్వక్సేనారాధన,పుణ్యాహ వచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ,నూతన యజ్ఞోపవీత సమర్పణ,జీలకర్ర, బెల్లం,మాంగళ్య ధారణ,తలం బ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు,స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## మహిళల అభ్యున్నతికి కేంద్ర పథకాలు

విశాఖపట్నం దేశంలో మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని బిజెపి జాతీయ మహిళా మోర్చా కార్యదర్శి పద్మజా మేనన్ అన్నారు.ట్రాన్స్ జెండర్ల సమస్యలపై ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి చూపించడం లేదని వ్యాఖ్యానించారు.వారి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని చెప్పారు.ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పర్యటనలో బాగంగా విశాఖలో మీడియాతో మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాలు,వివిధ మహిళా శిశు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని మహిళలు, శిశువులు, ట్రాన్స్ జెండర్ ల సమస్యల మీద పరిశీలన జరుపుతున్నామన్నారు. ఇటువంటి పరిశీలన పంజాబ్ రాష్ట్రంలో పూర్తిచేసుకుని ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోడీ దేశ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. గడిచిన ఎనిమిది ఏళ్లలో మహిళల జీవన ప్రమాణాలు ఎంతో పెరిగాయి అన్నారు.రాష్ట్రంలో కొన్ని పార్లమెంటు స్థానాల్లో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి జరిగే కృషిలో భాగంగా కేంద్ర మంత్రులు పర్యటించడం జరుగుతుందని ఎమ్మెల్సీ మాధవ్ తెలిపారు. పార్టీ విభాగాలు కూడా పర్యటించి వారి వారి విభాగాల్లో జరిగే కార్యక్రమాల లోటుపాట్లమీద నివేదికలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే మహిళా మోర్చా నేతల పర్యటన సాగిందనీ తెలిపారు. రేపటినుంచీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయనీ, అయితే సమావేశాలను అయిదు రోజులకు పరిమితం చేయటం సరికాదన్నారు. చాలా అంశాలు చర్చించాల్సి ఉన్న నేపథ్యంలో ఐదు రోజులు సమయం సరిపోదు అన్నారు. మళ్లీ మూడు రాజధానుల బిల్లు అసెంబ్లీ సమావేశాల్లో పెడతారని అంటున్నారనీ, మరోవైపు కేంద్రం ఆధ్వర్యాన విభజన సమస్యలమీద సమావేశం జరగనుందనీ, దానిలో ఏం ప్రస్తావించాలో సభల్లో చర్చించాలనీ సూచించారు. విభజనతోనే కాక ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల వలన కూడా ఏపీ నష్టపోయిందన్నారు.

# డివైఎఫ్ఐ రాష్ట్ర 15మహాసభ సందర్భంగా పెద్ద కడుబూరు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ బయలుదేరడం అయినది

కర్నూలు లో ఈనెల 17,18,19 వతేదీలలో జరిగే డివైఎఫ్ఐ 15వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో బస్ స్టాప్ నుండి పోలీస్ స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి రామన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతి, యువకులను మోసం చేశాయని ఆరోపించారు. నేడు రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసించిన లక్షలాది మంది యువకులు ఉపాధి లేక దుర్భరమైన జీవనం గడుపు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడా లేని విధంగా నిరుద్యోగ యువకులు నేడు ఆత్మహత్యలకు పాల్పడటం ప్రభుత్వాలకు సిగ్గు చేటు అన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నని చెప్పి కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులు మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యవతియువకులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభ సందర్భంగా 17వ తేదీన కర్నూలు



నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి రాజ్ విహార్ సెంటర్ వరకు జరిగే యువతీ యువకుల మహా ర్యాలీ జయప్రదం చేసేందుకు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సభలకు ముఖ్య అథితులుగా కేరళ టూరిజం, యువజనుల సర్విస్ మంత్రి మహమ్మద్ రియాజ్, డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు పార్లమెంటు సభ్యుడు రహిమ్ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో మాజీ డివైఎఫ్ఐ నాయకులు తిక్కన్న, పరవేష్, డివైఎఫ్ఐ మండల నాయకులు బాలు, వంశీ, అబ్రహం,రామన్న,ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దిలేటి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణం లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి



నేర నివారనే లక్షంగా అందరూ పనిచేయాలి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి ఐపిఎస్ నంద్యాల పట్టణం లో మంగళవారం అర్ధరాత్రి అన్నీ పోలీసు స్టేషన్ పరిధులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులలో సిసి కెమెరాలు ఏర్పాటు వాటి పనితీరుని పరిశీలించారు. కాలినడకన విస్తృతంగా పర్యటించి నేర నివారణే లక్ష్యంగా పని చెయ్యాలని అదికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించాలని వాటి పనితీరుని ఎప్పటికప్పుడు చూసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.నంద్యాల రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని పద్మావతి నగర్ ,టేక్కే ,ఎస్‌బిఐ కాలనీ లో పర్యటించి సెక్టార్ 1,సెక్టార్ 2 పోలీసు అదికారులతో మాట్లాడి నైట్ బీట్ ల పనితీరుని అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలపాల గురించి ఆరా తీశారు నంద్యాల బస్ స్టాండ్ వద్ద మైనర్లు ఆటో నడుపుచుండగా వాటిని సీజ్ చెయ్యాలని ఆదేశించారు. నంద్యాల టౌన్ లో శ్రీనివాస సెంటర్ లో ,రైల్వే స్టేషన్ వద్ద, పద్మావతి నగర్ లో, ఎ.మార్ట్ బొమ్మలసత్రం వద్ద నైట్ బీట్ లను చెక్ చేసి పోలీసు వారికి కొన్ని సూచనలు ఇచ్చారు. పట్టణం లో నంబర్ ప్లేట్ లేని వాహనాలని సీజ్ చేయాలని మరియు ఒక రోజు వాటిపై ప్రతెక డ్రైవ్ నిర్వహించాలని పోలీసు అదికారులను ఆదేశించారు.అనంతరం పోలీసు అధికారులకు, గస్తీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో తిరిగే అనుమానస్పద వ్యక్తులను విచారించాలన్నారు. గస్తీని ముమ్మరం చేయాలన్నారు. గస్తీ విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏయే సెక్టార్ లలో, ఎన్ని రూట్ లలో ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారనే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. నైట్ బీట్ లలో ప్రతి నైట్ బీట్ వారు మరియు సెక్టార్ ఆఫీసర్లు అందరూ మ్యాన్ ప్యాక్ కలిగి అప్రమత్తంగా ఉండాలని పిలిచిన వెంటనే రెస్పాన్స్ ఇవ్వాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు.

## అవును..మావోయిస్టులలో చేరాను

విశాఖపట్నం నర్సింగ్ విద్యార్థిని రాధిక మిస్సింగ్ అంటూ ఎన్ ఐ ఏ సోదాలపై ఎట్టకేలకు స్పష్టత లభించింది. నేను అదృశ్యం కాలేదు.. మావోయిస్టుల్లో చేరానంటూ రాధిక మీడియాకు లేఖ విడుదల చేసింది. నా పేరుతో ఎన్ ఐ ఏ సోదాలు చేస్తూ ప్రజా, మహిళా సంఘాల ప్రతినిధులను వేధిస్తున్నారు. నేను నర్సింగ్ విద్యార్థిని కాను.. మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ ను. మహిళల హక్కుల కోసం తొలుత చైతన్య మహిళా సంఘంలో చేరాను. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చడంతో మావోల్లో చేరాను. అప్పటికి నా వయస్సు 20 సంవత్సరాలు. మేజర్ ను కాబట్టి నాకు ఏది కావాలో నిర్ణయించుకోగలను.

# టి ఆర్ యస్ ప్రభుత్వం పార్లమెంట్ కు అంబేద్కర్ పేరు పెట్టడం హర్షించనియం




ఎమ్మిగనూరు -పార్లమెంట్ లో టి ఆర్ యస్ ప్రభుత్వం పార్లమెంట్ కు నవభారత రాజ్యాంగ నిర్మాత బహుజన సామ్రాజ్య చక్రవర్తి అయిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడం అనేది చాలా హర్షించదగ్గ

### మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

విషయం అని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి. రంగయ్య విలేకరుల సమావేశంలో తెలిపారు. రాబోయే భావి తరాలకు చరిత్ర గురించి తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని తెలిపారు.బాబా సాహెబ్ అంబేద్కర్ లాంటి మహనీయులు యావత్తు ప్రపంచానికే ఆదర్శం అని తెలిపారు. కేసీఆర్ కు వచ్చిన ఆలోచన ప్రతీ రాజకీయ నాయకుడికి రావాలని సూచించారు. అంతేకాక అంబేద్కర్ జీవిత చరిత్ర విద్యార్థులకు పాఠ్యముసంగా చేర్చాలని తెలిపారు. ప్రస్తుతం అంబేద్కర్ ఒకే కులం ఒక వర్గానికో పరిమితం చేయడం వాళ్లే దళితులపై దాడులు హత్యలు హత్యాచారాలు జరుగుతున్నాయని తెలిపారు.అలాంటి పరిస్థితులలో తెలంగాణ లో పార్లమెంట్ కు అంబేద్కర్ పేరు ను నామకరణం చేయడం అనేది తెలంగాణా ప్రభుత్వం కు శుభసూచకం అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆలోచన చేయాలని అంబేద్కర్ స్మారక స్మృతులను పర్యాటక కేంద్రాలను నిర్మించి భావి భారత పౌరులకు అయన కీర్తి ప్రతిష్టలు దేశ దశ దిశలా వ్యాప్తి చెందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమం లో రాయలసీమ అధ్యక్షులు సి రంగయ్య, మల్లేష్, గంగన్న బలరాం రాము పెద్దయ్య సూరి సుంకన్న నల్లన్న నగేష్ నడువలయ్య పెద్దయ్య లు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ నగర వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షురాలుగా సిట్రా నారాయణమ్మను నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్న



కర్నూలు జిల్లా కురవ సంఘం....... కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఉన్న కురువలను రాష్ట్ర ముఖ్యమంత్రి గుర్తించి కర్నూలు జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ నగర అధ్యక్షులుగా సిట్రా సత్య నారాయణమ్మ ను నియమించడంపై కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న ప్రధాన కార్యదర్శి ఎం .కే . రంగస్వామిలు ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారికి కర్నూలు జిల్లా అధ్యక్షులు మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గారికి కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో కురువలు 35 లక్షలు .జిల్లాలో ఆరు లక్షలు ఉన్న విషయాన్ని గమనించి వైఎస్ఆర్సిపి పార్టీ నగర పార్టీ అధ్యక్షురాలుగా కురువ సిట్రా నారాయణమ్మను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి గారితో కురువ గడ్డం రామకృష్ణ మాట్లాడుతూ కురువలకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని అందులో ముఖ్యంగా మదాసి మదారి కురువ సర్టిఫికెట్లు మంజూరు విషయంలో ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు అని గడ్డం రామకృష్ణ తెలిపారు.జిల్లాలో ముున్ముందు కూడా పదవుల్లో కురువలకు ప్రాధాన్యత ఇవ్వాలని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే ,ఎంపీ టికెట్లు కూడా కేటాయించాలని కర్నూలు జిల్లా నాయకులు కోరారు. అలాగే తెలుగుదేశం పార్టీలో కూడా కురువలకు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించి మా కులం ఓట్లను గుర్తించి ప్రాధాన్యత కల్పించాలని వారు కోరారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు కిష్టన్న నగర అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు,కార్యదర్శి బి .రామకృష్ణ కెసి నాగన్న బూదూరు లక్ష్మన్న,బి .వెంకటేశ్వర్లు ,బి .సి .తిరుపాల్,ఓపుల్లన్న ,దామోదర్‌దివాకర్ ,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# ఆ సినిమాలో హీరోని మార్చేస్తున్నారా?

'లైగర్' షాక్ నుంచి పూరి అండ్ కో ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. నష్టాల్ని భర్తీచేసే కార్యక్రమం మొదలైనట్లు తెలుస్తోంది. ఇది యూనిట్ మొత్తానికి ఊహించని షాక్. ఏదో అనుకుంటే? ఇంకేదో జరిగింది. అప్పుడప్పుడు ఇలాంటి తప్పవు. ఇలాంటి వాటిని ఎన్నో దాటుకుని పూరి నిలబడ్డాడు. ఇలాంటి గాలి వానల్ని ఆయన ఏమాత్రం లెక్క చేయడు.కాకపోతే అనుకున్నవి వెనుకా? ముందు అవుతుంటాయి. పూరి డ్రీమ్ ప్రాజెక్ట్ 'జనగణమన' విషయంలో అదే జరిగుతుంది. 'లైగర్' ఇంపాక్ట్ జనగణమనపై పడింది. దీంతో ఉన్నపళంగా జేజీఎమ్ ని పక్కనబెట్టేసారు. విజయ్ దేవరకొండ హీరోగా 30 శాతం




షూటింగ్ పూర్తి చేసారు. కానీ పరిస్థితులు సహకరించకపోవడంతో అర్ధంతరంగా నిలిపివేయాల్సి వచ్చిందని మీడియాలో ఇప్పటికే కథనాలు వెలువడ్డాయి.అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ వైరల్ అవుతుంది. ఇందులో హీరోగా నటిస్తోన్న విజయ్ దేవరకొండని తప్పిస్తున్నట్లు ఓ రూమర్ వినిపిస్తుంది. ఆయన స్థానంలో మరో హీరోని తీసుకుని మళ్లీ మొదటి నుంచి షూటింగ్ చేసే ప్లాన్ లో ఉన్నట్లు గుస గుస వినిపిస్తుంది. ఆ కారణంగానే పూరి ప్రాజెక్ట్ ని ఆపేసినట్లు ఫిలిం సర్కిల్స్ లో మాట్లాడుకుంటున్నారు.మరి దీని వెనుక వాస్తవాలు ఏంటి? అన్నది తెలియాలి. నిజంగా విజయ్ ని తప్పిస్తున్నారా? లేక ఆయనే తప్పుకుంటున్నాడా? అన్నది తెలియాలి. విజయ్ హీరోగా తెరకెక్కిన లైగర్ పాన్ ఇండియా వైడ్ ఎలాంటి అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిందో తెలిసిందే. ఈ సినిమా కోసం 100 కోట్లకు పైగా వెచ్చించారు. కానీ వసూళు అందులో సగం కూడా రాలేదు.దాదాపు ముప్పావు వంతుకు పైగా నష్టాలు భరించాల్సిన పరిస్థితి దాపరించింది. పూరి బ్రాండ్..విజయ్ పాన్ ఇండియా క్రేజ్ ఏ మాత్రం ఈ సినిమాకి పనికి రాలేదు. రిలీజ్ కి ముందు హడావుడి తప్ప! లైగర్ కి ఆ క్రేజ్ తో ఒరిగిందేం? లేదు. మరి వీటన్నింటిని బేరీజు వేసుకుని జేజీఎమ్ విషయంలో నిర్ణయాలు మార్చుకుంటున్నారా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అన్నది తెలియాలి.కానీ 'లైగర్' సినిమాతో పూరి-ఛార్మీకి విజయ్ మంచి స్నేహితుడైపోయాడు. ముగ్గురు పాలు..నీళ్లలో కలిసి పోయారు. ఆ బాండింగ్ తోనే మరో ఆలోచన లేకుండా జేజీఎమ్ ని ప్రకటించారు. మరి తాజా కథనాలకి ఎలాంటి బధులు దొరుకుతుందో చూడాలి. ప్రస్తుతం విజయ్ శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఖుషీ' సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే.

# ఓటీటీలో యుద్ధంతో రాసిన ప్రేమకథ పరిస్థితేంటి..?

దుల్కర్ సల్మాన్ - మృణాల్ ఠాకూర్ జంటగా.. రష్మిక మందన్నా - సుమంత్ - తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం "సీతా రామం". హను రాఘవపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ముందుగా తెలుగు తమిళ మలయాళ భాషల్లో మంచి వసూళ్లను రాబట్టిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ డ్రామా.. హిందీలో కాస్త ఆలస్యంగా రిలీజ్ అయింది. అక్కడా అనూహ్య స్పందన తెచ్చుకుంది.డిజిటల్ ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురు చూసిన 'సీతారామం' సినిమా.. ఏడు వారాల థియేట్రికల్ రన్ తర్వాత



అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా హోమ్ స్క్రీన్స్ మీదకు వచ్చేసింది. థియేట్రికల్ రిలీజ్ లో టాలీవుడ్ బాక్సాఫీస్ కు కళ తీసుకొచ్చిన ఈ చిత్రం.. ఇప్పుడు గత కొంత కాలంగా పెద్ద హిట్టు లేక డల్ గా ఉన్న ఓటీటీకి జోష్ తెచ్చిపెట్టిందని తెలుస్తోంది.సెప్టెంబర్ 9 అర్ధరాత్రి నుంచి ప్రైమ్ వీడియోలో 'సీతా రామం' స్ట్రీమింగ్ ప్రారంభం అవ్వగా.. కొన్ని గంటల్లోనే ఇండియా వైడ్ ట్రెండింగ్ లోకి వచ్చింది. గత నాలుగు రోజుల్లో ఈ చిత్రానికి కోట్లలో వ్యూస్ హోరెత్తిపోతున్నాయని డిజిటల్ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. సినిమా హాళ్లలో మిస్ అయిన జనాలతో పాటుగా థియేటర్లో చూసిన వాళ్ళు కూడా ఇప్పుడు ఓటీటీలలో ఈ చిత్రాన్ని ఆదరిస్తున్నారని తెలుస్తోంది.మంచి కంటెంట్ తో వస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని ఇప్పటికే థియేటర్ రిలీజ్ ద్వారా 'సీతా రామం' ప్రూవ్ చేసింది. తెలుగు తమిళ మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమాకు ఇప్పుడు ఓటీటీలోనూ విశేష ఆదరణ లభిస్తోంది. ఇలాంటి సినిమాను థియేటర్ లో ఎలా మిస్ అయ్యాం అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.హిందీ వెర్షన్ రిలీజైన కేవలం వారానికే మిగతా భాషల్లో డిజిటల్ రిలీజ్ చేసేయడం కూడా ప్రైమ్ కు చాలా ప్లస్ అవుతోందని అర్థమవుతోంది. విదేశాల్లోనూ సబ్ టైటిల్స్ తో 'సీతా రామం' సినిమాను అత్యధికలు చూసి ఎంజాయ్ చేస్తున్నారని సోషల్ మీడియా చూస్తే తెలుస్తుంది. ట్రెండ్ చూస్తుంటే రాబోయే రోజుల్లో డిజిటల్ స్పేస్ లోనూ ఈ సినిమా రికార్డులు నెలకొలిపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# అల్లు అర్జున్ ఒకే ఒక జీవితం.. అదిరి పోయే ప్లాన్



యంగ్ హీరో శర్వానంద్ చాలా సంవత్సరాలుగా సక్సెస్ కోసం చాలా పాట్లు పడుతున్నాడు. ఆయన ఎన్ని ప్రయత్నాలు చేసినా కూడా నిరాశే మిగిలింది. ఎట్టకేలకు శ్రీకార్తిక్ రూపంలో శర్వానంద్ కి సక్సెస్ దక్కింది. శ్రీకార్తిక్ దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా ఒకే ఒక జీవితం సినిమా తెరకెక్కి ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది.పెద్దగా అంచనాలు లేకుండా.. ఒక మంచి కాన్సెప్ట్ మూవీ అన్నట్లుగా ప్రచారం చేసి ప్రేక్షకుల ముందుకు వచ్చి కమర్షియల్ గా పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పటికే పలు ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ సాధించిందని.. అన్ని ఏరియాల్లో కూడా మొదటి మూడు రోజులు మంచి వసూళ్లు నమోదు అవ్వడంతో లాంగ్ రన్ లో మంచి కమర్షియల్ విజయంగా ఒకే ఒక జీవితం నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.శ్రీకార్తిక్ విభిన్నమైన టైమ్ ట్రావెల్ సినిమా ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చి తెలుగు తో పాటు తమిళంలో కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఈ దర్శకుడి పేరు టాలీవుడ్ మరియు కోలీవుడ్ లో ప్రముఖంగా వినిపిస్తుంది. యంగ్ హీరోలు ఈయనతో సినిమాకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈయన మాత్రం ఇప్పటికే తన రెండవ తెలుగు సినిమా ను ఫిక్స్ చేసుకున్నాడట.అల్లు అర్జున్ తో ఈ తమిళ దర్శకుడు తన రెండవ సినిమాను చేయాలని ఆశ పడుతున్నాడు. అల్లు అర్జున్ కోసం ఒక ఫాంటసీ రియలిజం సినిమా కథను రెడీ చేసినట్లు శ్రీకార్తిక్ చెప్పుకొచ్చాడు. తమిళ్ లో అల్లు అర్జున్ కి మంచి ఫాలోయింగ్ ఉంది. మా ఫ్యామిలీలో అందరూ అల్లు అర్జున్ అభిమానులే. అందుకే నేను ఆయనతో సినిమా చేయాలని కోరుకుంటున్నాను.త్వరలోనే తన వద్ద ఉన్న ఫాంటసీ రియలిజం కథను అల్లు అర్జున్ కి వినిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెప్పుకొచ్చాడు. టైమ్ ట్రావెల్ వంటి విభిన్నమైన కథను తీసుకుని దర్శకుడు శ్రీకార్తిక్ చేసిన ప్రయోగం సక్సెస్ దక్కించుకున్న నేపథ్యంలో ఆయన దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించేందుకు ఒకే చెప్పే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని.. అయితే దర్శకుడు మంచి కథతో బన్నీని ఇంప్రెస్ చేయాలని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఒక వేళ శ్రీకార్తిక్ కి ఓకే చెప్పినా కూడా వెంటనే డేట్లు ఇచ్చే పరిస్థితిలో అయితే అల్లు అర్జున్ లేదు. పుష్ప మొదలుకుని రెండు మూడు సినిమాలకు బన్నీ ఓకే చెప్పాడు. కనుక ఎప్పటికి బన్నీ నుండి శ్రీకార్తిక్ కి గ్రీన్ సిగ్నల్ వస్తుంది అనేది క్లారిటీ లేదంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

# చిన్న వయసులోనే గుండెపోటు రావడానికి కారణం ఏంటో తెలుసా?



మెదడుకు రక్త ప్రసరణలో ఆటంకం ఏర్పడినప్పుడు స్ట్రోక్ వస్తుంది. ఇది జరిగిన తర్వాత, మెదడులోని కణాలు చనిపోవడం ప్రారంభిస్తాయి. స్ట్రోక్ అనేది నయం చేయలేని మరియు ప్రాణాంతక పరిస్థితి. మరియు లక్షలాది మంది భారతీయులు ఈ విషయాన్ని గుర్తించలేని ప్రమాదంలో ఉన్నారు.అనేక మెదడు వ్యాధుల మాదిరిగానే, స్ట్రోక్ రోగుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. అయితే దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేదు. చాలాసార్లు రక్తనాళాల్లోని ఫలకాల వల్ల గుండెకు రక్తప్రసరణ ఆగిపోయినప్పుడు ఏదో ఒక సమయంలో గుండెకు వెళ్లే రక్తం పూర్తిగా ఆగిపోతుంది. ఇది గుండెపోటు లేదా స్ట్రోక్‌కు దారి తీస్తుంది.వివిధ అలవాట్లు ఒక వ్యక్తి యొక్క రక్త నాళాలలో అడ్డంకులు కలిగిస్తాయి, ఇది గుండెపోటు లేదా స్ట్రోక్‌కు దారి తీస్తుంది. వాటిలో అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు పేద జీవనశైలి దీర్ఘకాలిక వ్యాధులతో సంబంధం ఉన్న మరణ ప్రమాదాన్ని పెంచుతాయి. ఇప్పుడు ఒక వ్యక్తికి గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని పెంచే జీవనశైలి కారకాలు ఇవ్వబడ్డాయి.ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడంసోడియం ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తీసుకునే వారికి స్ట్రోక్ లేదా గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేలింది. సాధారణంగా ఉప్పగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. ప్రపంచవ్యాప్తంగా 50 శాతం కంటే ఎక్కువ స్ట్రోక్ లేదా హార్ట్ ఎటాక్ కేసులకు కారణమయ్యే ఆహారంలో ఉప్పు ఎక్కువగా చేర్చడం ఈ అలవాటు. రోజుకు 2,000 మిల్లీగ్రాములు లేదా అంతకంటే తక్కువ ఉప్పు తీసుకునే వారితో పోలిస్తే, రోజూ 4,000 మిల్లీగ్రాముల ఉప్పు తీసుకునే వారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎక్కువ.ఫిబ్రవరి 4 ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం: ఈ ప్రాణాంతక వ్యాధిని ఎలా నివారించాలి

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**